# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 14-09-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారతదేశపు మొట్టమొదటి వెదురు ఆధారిత బయో-ఇథనాల్ ప్లాంట్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ రోజు అస్సాంలో ప్రారంభించారు.
- ❖ జీఎస్టీ సంస్కరణలతో దాదాపు 99 శాతం వస్తువులపై జీఎస్టీ శాతాన్ని 12 నుండి 5 శాతానికి తగ్గించామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.
- ❖ ప్రాంతీయ భాషలను గౌరవిస్తూనే హిందీ భాషను ప్రోత్సహించాలని కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.
- ❖ భారత్ పాకిస్థాన్ జట్ల మధ్య జరుగుతున్న టీ 20 క్రికెట్ మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేస్తున్న పాకిస్థాన్ 4 ఓవర్లు పూర్తయ్యే సరికి 2 వికెట్లు నష్టపోయి 32 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో భాగంగా ఈరోజు అస్సాంలో 6 వేల 300 కోట్ల రూపాయల విలువైన మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా దరంగ్ జిల్లాలోని మంగళ్‌డోయ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధామంత్రి ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ... వికసిత్ భారత్ కోసం దేశం సంకల్పించిందని, దీనిలో ఈశాన్య రాష్ట్రాలు కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని 13 శాతం వృద్ధిని నమోదు చేస్తోందని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

అనంతరం గోలాఘాట్‌లోని నుమాలిఘర్ రిఫైనరీ ప్లాంట్‌లో భారతదేశపు మొట్టమొదటి వెదురు ఆధారిత బయో-ఇథనాల్ ప్లాంట్‌ను ప్రధానమంత్రి ప్రారంభించారు. అస్సాం పెట్రో కెమికల్ రంగానికి గణనీయమైన విలువను జోడించే నుమాలిఘర్ రిఫైనరీ లిమిటెడ్‌లో పాలీప్రొపైలిన్ ప్లాంట్‌కు కూడా ఆయన శంకుస్థాపన చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇటీవల తీసుకొచ్చిన భావితరం జీఎస్టీ సంస్కరణలతో దాదాపు 99 శాతం వస్తువులపై జీఎస్టీ శాతాన్ని 12 నుండి 5 శాతానికి తగ్గించామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. చెన్నైలో ఈరోజు జరిగిన ఒక వాణిజ్య సదస్సులో నిర్మలా సీతారామన్ పాల్గొని ప్రసంగించారు. రానున్న పండుగ సీజన్ దృష్ట్యా ఈ జీఎస్టీ సంస్కరణలు ప్రతీ భారతీయుడికి ప్రయోజనం చేకూరుస్తాయని చెప్పారు. 8 సంవత్సరాల క్రితం, జీఎస్టీని ప్రవేశపెట్టినప్పుడు మొత్తం 65 లక్షల కంపెనీలు వస్తు సేవల పన్ను శాతాన్ని చెల్లించాయని.. నేడు అది కోటి 50 లక్షలకు పెరిగిందని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కాలానుగుణంగా హిందీని మరింత సరళీకృతం చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ప్రాంతీయ భాషలను గౌరవిస్తూనే.. హిందీ భాషను ప్రోత్సహించాలన్నారు. హిందీ దినోత్సవం సందర్భంగా గాంధీనగర్‌లోని మహాత్మా మందిర్‌లో ఈరోజు ఆయన 5వ అఖిల భారత రాజభాషా సమ్మేళనాన్ని ప్రారంభించారు. హిందీని మరింత అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం సారథి వేదిక, హిందీ శబ్ద సింధు కోష్ వంటి కార్యక్రమాలను ప్రవేశపెట్టిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. హిందీ కేవలం సాధారణ బాషగా మాత్రమే కాకుండా శాస్త్ర సాంకేతికత, న్యాయ వ్యవస్థ, పోలీసింగ్ భాషగా కూడా మారాలని అమిత్ షా ఆకాక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంగా మారుతుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పియూష్ గోయల్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈరోజు న్యూఢిల్లీలో ఒక ప్రైవేట్ మీడియా సంస్థ నిర్వహించిన చర్చా గోష్టిలో పీయూష్ గోయల్ మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉందని చెప్పారు. 2014లో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చినప్పుడు ఖర్చు నియంత్రణ ప్రభుత్వ ప్రాధాన్యతగా ఉండేదన్నారు. అలాగే భావితరం GST సంస్కరణలు పన్నుల వ్యవస్థను సరళీకృతం చేశాయని పీయూష్ గోయల్ వివరిస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వికసిత్ భారత్ దిశగా దేశం పయనిస్తోందని లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. ఈ ప్రయాణంలో మహిళా సమాజం కూడా ప్రధాన పాత్ర పోషిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అందుకు మహిళలు అన్నీ రంగాల్లో సాధికారత సాధించాలన్నారు. చట్ట సభల్లో మహిళా సాధికారిత అనే అంశంపై రెండు రోజుల పాటూ జాతీయ సదస్సుని ఈరోజు ఆయన ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి నగరంలో ప్రారంభించారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడే దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని ఓం బిర్లా ఈ సందర్భంగా పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచంలో మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ పరిణమిస్తోందని కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఈరోజు ఆయన పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అందులో భాగంగా భారతీయ జనతా పార్టీ ఏర్పాటు చేసిన ఒక బహిరంగ సభలో ప్రసంగిస్తూ... నేడు రక్షణ రంగ ఎగుమతులు 7 రేట్లు పెరిగాయన్నారు. భారత్ లో సెల్ ఫోన్ల తయారీ 92 లక్షలు దాటిందని, అమృత్ వంటి పథకాలతో లక్షల కోట్ల రూపాయలతో సమగ్రాభివృద్ధి జరుగుతోందన్నారు. 2014లో నరేంద్ర మోదీ తొలిసారి ప్రధానమంత్రి అయినపుడు దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో 11వ స్థానంలో ఉండేదని.. ఇప్పుడు 3వ స్థానానికి చేరుకుంటున్నామని జేపీ నడ్డా వ్యాఖ్యానిస్తూ...

(వాయిస్ 23 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ పంజాబ్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. ఆ రాష్ట్రంలోని వరద బాధితులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ విపత్కర పరిస్థితి నుంచి బయటకు తీసుకురావడానికి అవసరమైన ప్రతి సహాయాన్ని అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేస్తాయన్నారు. పంజాబ్ వద్ద ఇప్పటికే ఉన్న 12 వేల కోట్ల రూపాయలను ముందుగా రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (SDRF) కింద వినియోగించాలని, ఆ తర్వాత మరిన్ని నిధులు కోరడానికి రాష్ట్ర ప్రభుత్వం తన వినియోగ ధృవీకరణ పత్రాన్ని సమర్పించాలని ఆయన స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య దుబాయి ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా జరుగుతున్న టీ 20 క్రికెట్ మ్యాచ్ లో పాకిస్థాన్ తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి 5 ఓవర్లు పూర్తయ్యే సరికి పాకిస్థాన్ 2 వికెట్ల నష్టపోయి 34 పరుగులు చేసింది. భారత బౌలర్లలో హార్ధిక్ పాండ్యా, జస్‌ప్రీత్ బుమ్రా చెరో వికెట్ తీశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 126వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 26వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర, కర్ణాటక, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లో రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది. జమ్మూ-కాశ్మీర్, లడఖ్, గిల్గిట్-బాల్టిస్తాన్, ముజఫరాబాద్, తెలంగాణాలలో రానున్న3 రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని ఐ.ఎం.డి. వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =